## గత ప్రభుత్వం జలజీవన్ మిషన్ నిధులను ఉపయోగించకుండా భ్రష్టు పట్టించింది : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,నవంబర్27,ప్రభాతవార్త:** గడిచిన ఐదు సంవత్సరాలలో జలజీవన్ మిషన్ నిధులను



ఉపయోగించకుండా ఉండటం వల్ల గ్రామాలలో నీటి సమస్యలు అలాగే ఉన్నాయని మాజీమంత్రి, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షుడు, స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. బుధవారం తన నివాసంలో ఆర్‌డబ్ల్యుఎస్ మరియు ఎన్ఎస్‌పి అధికారులతో ప్రత్తిపాటి సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో డిసెంబర్ 5న.జరిగే నీటి సంఘాల ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పసుమర్రు గ్రామంలో చెరువుకు రూ 6 కోట్ల నిధులతో పనులు పూర్తి అయినప్పటికి గ్రామంలో నీటి సరఫరా జరగడంలేదన్నారు. నీటి సరఫరా సమస్యలు నిరంతరం ఎందుకు వస్తున్నాయని అధికారులను అడిగారు. వెంటనే చెరువుకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ప్రత్తిపాటి ఆదేశించారు. నియోజకవర్గంలో 30 కోట్ల రూపాయిల నిధులతో 64 పనులకు సంబంధించి జలజీవన్ గ్రాంట్ కింద విడుదల అయిన పనుల పురోగతి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు 18 పనులు పూర్తికాగా 5పనులు జరుగుతున్నాయని, 41 పనులు ఇప్పటివరకు మొదలు కాలేదని ఈఈ తెలియచేశారు. ఇక మీదట చేపట్టే పనులన్నీ ప్రణాళికా బద్ధంగా పనులన్నింటిని ప్రాధాన్యత క్రమంలో చేపట్టి పూర్తి చేయాలని ప్రత్తిపాటి అధికారులను ఆదేశించారు.

## ములుకుదురులో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

**పొన్నూరు, నవంబర్ 27,ప్రభాతవార్త:** పవిత్రమైన కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని ములుకుదురు గ్రామంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. గ్రామంలో కొలువై వున్న శ్రీ భూ నీలా రాజ్యలక్ష్మీ సమేత శ్రీ చెన్నకేశవస్వామివారికి మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఊంజల్ సేవ నిర్వహించారు. ప్రతి ఏటా కార్తీక మాసం చివరి మంగళవారం రోజున పెద్ద ఎత్తున కర్పూర జ్యోతిని ప్రజ్వలన చేయడం ఆనవాయితీ అందులో భాగంగా కర్పూర జ్యోతిని వెలిగించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దీంతోపాటు దేవాలయంలో సహస్రదీపాలంకరణ సేవ కూడా నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రమిదలలో నూనెను పోసి ఒత్తులను వెలిగించి భక్తిప్రపత్తులు చాటుకున్నారు. కర్పూర ప్రజ్వలనను భక్తులు కన్నుల పండువగా తిలకించారు. ఈ సందర్భంగా అర్చకస్వాములు నారాయణం కేశవమూర్తి, రవి,అనీల్ మాట్లాడుతూ కార్తీక మాసం హరిహరులకు ప్రీతిపాత్రమైన మాసమని చెప్పారు. ఈ మాసంలో ప్రతి హిందువు వేకువ జామునే చన్నీటీ స్నానం చేసి దగ్గర్లోని దేవాలయానికి వెళ్ళి స్వామివారిని పూజిస్తే సర్వసుఖాలు, సుభాలు కలుగుతాయని



చెప్పారు. కార్తీక మాసంలో వన సమారాధనలు కూడా నిర్వహించడం ఎప్పటి నుంచో వస్తున్న ఆనవాయితీ అన్నారు.సంగం డెయిరీ డైరెక్టర్ బొర్రు రామారావు కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా దేవాలయం కార్యనిర్వహణాధికారి నిడమానూరి శ్రీనివాసరావు పర్యవేక్షణలో సీనియర్ అసిస్టెంట్ జయదేవ్ ఏర్పాట్లు చేశారు.

## పారిశుద్ధ్యం పట్ల ఎటువంటి నిర్లక్ష్యాన్ని సహించం : ఎమ్మెల్యే అరవింద్‌బాబు

**నరసరావుపేట టౌన్, నవంబర్ 27 ప్రభాతవార్త :** పారిశుద్ధ్యం పట్ల ఎటువంటి నిర్లక్ష్యాన్ని సహించమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. బుధవారం పట్టణం లోని 1వ వార్డు పరిధిలో ఉన్న సాయి నగర్‌లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులను ఎమ్మెల్యే అరవింద్ బాబు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అన్ని ప్రాంతాలలో పారిశుద్ధ్య మెరుగుదలకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మున్సిపల్ సిబ్బందితో పాటు



అధికారులు క్షేత్రస్థాయిలో ఉన్నటువంటి పారిశుద్ధ్య మెరుగుదలకు సహకరించాలన్నారు. ప్రస్తుత సీజన్‌లో అంటువ్యాధులు ప్రభలకుండా తీసుకుంటున్న కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు స్థానికులు సహకారం అందించాలన్నారు. అనంతరం వంగవీటి మోహన్‌రంగా విగ్రహానికి ఎమ్మెల్యే అరవింద్‌బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

**మంగళగిరి,నవంబర్ 27,ప్రభాతవార్త :** పట్టణానికి చెందిన పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను మంత్రి నారా లోకేష్ స్థానిక నాయకుల ద్వారా అందజేయించారు.టిడిపి నాయకులు స్వయంగా లబ్ధిదారుల ఇళ్ళకు వెళ్ళి పంపిణీచేశారు.గండాలయ్యపేటకు చెందిన కోట మహేష్‌కు రూ.80వేలు,మంగళగిరి పట్టణానికి చెందిన మహ్మద్ ఇబ్రహీంకు రూ.26,626లు, 18వ వార్డుకు చెందిన టిప్పబత్తుని చిన్నికృష్ణకు రూ.46,500లు,వీవర్స్ కాలనీ కి చెందిన చింతలపూడి లక్ష్మీకి రూ.28,800లు, షరాఫ్ బజార్‌కు చెందిన అవ్వారు సాంబశివరావుకు రూ.48,541లు అందజేశారు.చెక్కులు అందుకున్న లబ్ధిదారులు మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ చొరవతోనే ఎంతోమందికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు వస్తున్నాయని చెప్పారు.కార్యక్రమంలో మంగళగిరి పట్టణ ఎస్టీ సెల్ అధ్యక్షులు పేరం ఏడుకొండలు,జంజనం శ్రీనివాసరావు,బిట్రా దుర్గారావు,మల్లెల నాగయ్య,పొట్లబత్తిని దుర్గాప్రసాద్,జంజనం సత్యనారాయణ పాల్గొన్నారు.

## తెదేపా సభ్యత్వంతో ప్రతి కార్యకర్తకు కొండంత భరోసా : ఎమ్మెల్యే అరవింద్‌బాబు

**నరసరావుపేట, నవంబర్ 27 ప్రభాతవార్త :** టిడిపి సభ్యత్వంతో ప్రతి కార్యకర్తకు కొండంత భరోసా లభిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో కార్యకర్తలను ఉద్దేశించి ఎమ్మెల్యే అరవింద్‌బాబు మాట్లాడారు. నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలతో పాటు రేషన్ డీలర్లు, క్లస్టర్ యూనిట్ బాధ్యులు కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రతి ఒక్కరూ పార్టీ సభ్యత్వ విజయానికి కృషి చేయాలన్నారు. తెలుగుదేశంపార్టీ ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా పని చేస్తుందన్నారు. సిఎం నారా



చంద్రబాబునాయుడు బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నారన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందేందుకు, ప్రజలకు సంక్షేమం అందేందుకు తెలుగుదేశం పాలన కొనసాగాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ఈ సందర్భంగా తెలియజేశారు.

## ఎపిఐడిసి చైర్మన్ దేగల ప్రభాకర్‌ను సత్కరించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,నవంబర్27,ప్రభాతవార్త:** గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లో బుధవారం రాష్ట్ర ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా దేగల ప్రభాకర్ పదవి బాధ్యతలు చేపట్టారు. చైర్మన్ దేగల ప్రభాకర్ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి మాజీమంత్రి, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు ముఖ్య అతిధిగా



హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీ కోసం శ్రమించిన ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందని అన్నారు. అనంతరం చైర్మన్‌గా పదవి భాధ్యతలు చేపట్టిన దేగల ప్రభాకర్‌ను ప్రత్తిపాటి ఘనంగా సత్కరించారు.

## తుఫాన్ సూచనల నేపధ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి

**యడ్లపాడు, నవంబర్ 27, ప్రభాతవార్త :** ప్రస్తుతం తుఫాన్ సూచనల నేపధ్యంలో ప్రత్తి



రైతులు అప్రమత్తంగా ఉండాలని, పొలాలలో ఉన్న ప్రత్తిని సాధ్యమైనంత త్వరగా పత్తిని తీసి సురక్షితమైన ప్రాంతాలలో నిల్వఉంచుకోవాలని ఎవో సిహెచ్ సరిత పేర్కొన్నారు. మండల పరిదిలోని లింగారావుపాలెం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా అమె పొలాలను పరిశీలించి రైతులకు సూచనలు అందజేసారు. గురువారం నుండి ఇ క్రాఫ్ రబీ పంటల నమోదు ప్రారంభం కాబడుతుందని, కావున తమ పంటలు శనగ, మొక్కజొన్న, పొగాకు, వరి పంటల నమోదు చేయించుకోవాలని, వరి పంట వేసిన రైతులు రబీ సీజన్‌లో ఎకరాకు 630చెల్లించి భీమా నమోదు చేయించుకోవాలని సూచించారు. పత్తి రైతులు తమ పంటను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకు వచ్చిన సీసీఐ కేంద్రాలలో విక్రయించుకోవాలన్నారు. కార్యక్రమంలో అర్‌బికె సిబ్బంది, రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు

**యడ్లపాడు, నవంబర్ 27, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కొండవీడు గ్రామంలోని ఎంపియూపి స్కూల్ నందు బుదవారం బాలబాలికలకు బాల్యవివాహ రహిత భారత్, బాల్య వివాహ రహిత అంధ్రప్రదేశ్ కార్యక్రమంలో అవగాహన కార్యక్రమం ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జోజమ్మ నిర్వహించారు. బాల్యవివాహాల వలన కలుగు నష్టాలు తదుపరి వచ్చే సమస్యలపై వారికి అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో



పాఠశాల హెచ్ఎమ్ శ్రీనివాసరావు, పిఎస్ చారి, విఆర్‌వో కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌విఆర్ జేసి ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌సిసి విద్యార్థులకు బెస్ట్ క్యాడెట్స్ అవార్డులు

**గుంటూరు విద్య,నవంబర్ 27,ప్రభాతవార్త :** తమ కళాశాల విద్యార్థులు సాంకేతిక ప్రతిభలతో పాటు సామాజిక సేవల్లో పురస్కారాలు అందుకోవడం గర్వకారణం అని ఆర్‌విఆర్ జేసి ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని పేర్కొన్నారు.ఎన్‌సిసి ఇంజనీర్‌కాయ్ గుంటూరు గ్రూప్ ద్వారా ఆర్‌విఆర్ జేసి ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన జూనియర్ అండర్ ఆఫీసర్ షేక్ మహ్మద్ మహారాజ్ భాషా మరియు సార్జంట్ రాజశేఖర్



ఇద్దరు ఎన్‌సిసి విద్యార్థులకు గుంటూరు గ్రూప్ కమాండర కల్నల్ ఎస్.ఎమ్.చంద్రశేఖర్,ఆఫీసర్ ఇన్ కమాండింగ్ కల్నల్,నీరజ్‌కుమార్ చేతుల మీదుగా బెస్ట్ క్యాడెట్స్ అవార్డులను,ప్రశంసా పత్రాలను అందుకున్నారు.తమ కళాశాల విద్యార్థులు భారత దేశ రక్షణ ఆర్మీ దళంలో మేజర్,కెప్టెన్ హోదాల్లో,నేవీ దళంలో సబ్ లెఫ్టినెంట్లుగా ఉన్నతస్థాయి హోదాల్లో దేశ సేవలో ఉండడం తమ కళాశాలకే గర్వకారణమని,విద్యార్థి అభిరుచులకు అనుగుణంగా వారికి నిపుణులచే శిక్షణ అందించి వారికి ఉజ్వల భవిష్యత్తును అందించడమే తమ లక్ష్యమని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ,ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ పేర్కొన్నారు.పురస్కారాలు అందుకున్న క్యాడెట్లను అభినందించిన వారిలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్,కళాశాల ఎన్‌సిసి బాలుర విభాగ ఆఫీసర్ లెఫ్టినెంట్ తారచంద్ తదితరులు ఉన్నారు.

## దైద అమరలింగేశ్వరునికి ఎమ్మెల్యే యరపతినేని పూజలు

**గురజాల, నవంబరు 27 ప్రభాతవార్తః** మండలంలోని దైద బిలంలో వేంచేసియున్న శ్రీగంగా పార్వతి సమేత అమరలింగేశ్వరస్వామిని బుధవారం శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన బస్సు షెల్టర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ అమరలింగేశ్వరస్వామి ఎంతో మహిమాన్వితుడని చెప్పారు. దైద ఆలయాన్ని పర్యాటకంగా



అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీపీ పులుకూరి కాంతారావు, పట్టణ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, కౌన్సిలర్ బొల్లయ్య, చాగంటి శ్రీను, శివనాగు, ఆకుల పిచ్చయ్య గుప్త, జనసేన నేత కటకం అంకారావు, ఉప్పిడి నరసింహారావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

## గురజాల సిఐగా భాస్కర్

**గురజాల, నవంబరు 27 ప్రభాతవార్తః** గురజాల సీఐగా ఆవుల భాస్కర్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వివాదాలకు జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఏవైనా సమస్యలుంటే నేరుగా పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయాలన్నారు. కాగా ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన పి భాస్కర్ బదిలీపై దాచేపల్లి వెళ్లారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆవుల భాస్కర్‌ను ఎస్ఐ వినోద్‌కుమార్, సిబ్బంది అభినందించారు.



## విద్యార్థుల్లో ఉచ్చారణా దోషాలు సరిదిద్దాలి

### -రీజినల్ జాయింట్ డైరెక్టర్ బి.లింగేశ్వరరెడ్డి

**పొన్నూరు, నవంబర్ 27,ప్రభాతవార్త:** ఉపాధ్యాయులు విద్యార్థుల సామర్థ్యాన్ని బట్టి బోధన చేయడంతోపాటు వారిలోని ఉచ్చారణా



దోషాలను సరిచేయాలని పాఠశాల విద్య రీజినల్ జాయింట్ డైరెక్టర్ బి.లింగేశ్వరరెడ్డి ఆదేశించారు. మండల పరిధిలోని ములుకుదురు ఎంపియుపి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్జేడి రాక స్థానిక అధికారులకు, ఉపాధ్యాయులకు కూడా తెలియజేయకుండా ఆకస్మికంగా వచ్చారు. పాఠశాలలోని వివిధ తరగతులను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. తెలుగు, హిందీ ఎలా చదువుతున్నారన్న విషయాలను స్వయంగా తెలుసుకొన్నారు. విద్యార్థులకు కూడికలు, తీసివేతలు ఏ మేరకు చేయగలుగుతున్నారన్న విషయాన్ని తెలుసుకొన్నారు. అక్షరాలు గుర్తు పడుతున్నారా..?లేదా..? చదవడం, వ్రాయడం వస్తుందా....?లేదా.... అనే విషయాలను అడిగి తెలుసుకొన్నారు. వర్క్‌బుక్స్‌ను పరిశీలించారు. సిలబస్ ఏ మేరకు పూర్తయిందన్న విషయాలను అడిగి తెలుసుకొన్నారు. అపార్ వివరాలను ఏ మేరకు నమోదు చేశారన్న విషయాలను పరిశీలించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు వి.మాలతి ఆర్జేడికి వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.నిర్మలాదేవి, పి.గౌసియా ఖానుమ్, బి.కమల, కె.లావణ్య, యశోద తదితరులున్నారు.

## ప్రమాద భరితంగా పొంచి ఉన్న ప్రమాదం

**యడ్లపాడు, నవంబర్ 27, ప్రభతవార్త :** చారిత్రక కొండవీడు కొండలపైకి వెళ్ళే ఘాట్ రోడ్డు



ప్రాంతములో రోడ్డుపై ఉన్న మట్టి మరియు రాతి ముక్కలు పర్యాటకులకు ప్రమాధ భరితంగా మారే అవకాశాలు మెండుగా ఉన్నాయి. గతంలో భారీ వర్షాలకు కొండ చర్యలు విరిగి పడిన ప్రాంతములో అధికారులు పెద్ద బండ రాళ్ళను అయితే తొలగించారు కాని అప్రాంతములో పడిన మట్టి మరియు చిన్న పాటి రాతి ముక్కల తొలగింపు చేపట్ట లేదు. దీని కారణంగా పర్యాటకులు ద్విచక్రవాహనాలపై వచ్చే టప్పుడు ప్రమాధ భరితంగా ఉందని అంటున్నారు. అదీను ఇవి ఎక్కవగా మలుపుల వద్ద ఉండటం దగ్గరికి వచ్చేవరకు కనపడదని, దగ్గరకు వచ్చిన తదుపరి వాహనాన్ని అదుపు చేసుకోలేకపోతే ప్రమాదం తప్పదని అంటున్నారు. అధికారులు వీటిపై దృష్టి సారించాలంటున్నారు.

## రైతుల సేవలో ఏరిస్ సంస్థ

**కొల్లూరు, నవంబరు 27 (ప్రభాతవార్త) :** ప్రముఖ అగ్రగామి సంస్థ అగ్రో లిమిటెడ్ వారు దిగ్విజయంగా 55వసంతాలు పూర్తి చేసుకుని 56వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా బుధవారం కొల్లూరు మండల పరిధిలోని పెసరలంక గ్రామంలో రైతు అవగాహన సదస్సు అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఏరిస్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ జయప్రదీప్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వ్యవసాయ రంగంపై అవగాహన కల్పిస్తూ ప్రస్తుతం నేల యొక్క ఆరోగ్య పరిస్థితులు తెలుసుకొని భూసార పరీక్షలు



నిర్వహిస్తూ సమగ్రపోషక యాజమాన్యం ద్వారా వ్యవసాయ పంటలలో అధిక దిగుబడులు సాధించడమే కాకుండా దేశానికి పౌష్టికాహారం కూడా అందించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్.వి.రత్తయ్య, జెడ్ఎస్ఎమ్ఎన్ వి.మాధవ్, ఆర్ఎస్ఎం పి.వెంకటేశ్వరరావు, సీనియర్ మేనేజర్ బి.సుందరరాజు, సీనియర్ మేనేజర్ బి.సుందరరాజు, సీనియర్ మేనేజర్ ప్రతాప్, అసిస్టెంట్ జోనల్ మేనేజరు, ఎరువుల షాపుల డీలర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి: ఏవో శ్రీనివాసరెడ్డి

**పిడుగురాళ్ల, నవంబరు 27 ప్రభాతవార్తః** ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు



కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో శ్రీనివాసరెడ్డి అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని వీరాపురం, తుమ్మలచెరువు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ధాన్యం 75 కేజీల బస్తాకు ప్రభుత్వం రూ. 1740ల గిట్టుబాట ధర ప్రకటించిందన్నారు. ధాన్యం అమ్మదలచిన రైతులు తమ గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. రెండు రోజుల్లో వర్ష సూచన ఉన్నందున వరి కోత చేసే రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం వరికోత పొలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకురాలు మేరి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా పాలన మొత్తం స్కాంలా మయం

**నకరికల్లు, నవంబర్ 27 ప్రభాతవార్త :** వైకాపా పాలన మొత్తం స్కాంల మయమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపిపి నాగోతు శౌరయ్య అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ పేరిట కాంట్రాక్టర్లను మార్చి మోసం చేసిందన్నారు. కాంట్రాక్టర్ల వద్ద నుండి భారీగా ముడుపులు తీసుకోవడం జరిగిందన్నారు. మద్యం విధానం, ఇసుక పాలసీ, స్మార్ట్ మీటర్ల టెండర్లలోనూ అవినీతికి పాల్పడ్డారన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను పక్కనపెట్టి తమ స్వప్రయోజనాలను అప్పటి ప్రభుత్వం తీసుకుందన్నారు. ఖచ్చితంగా తప్పు చేసిన వారికి శిక్ష ఉంటుందన్నారు.



రాష్ట్రానికి వచ్చిన అనేక మంది పారిశ్రామికవేత్తలను బెదిరించి లంచాలు తీసుకునే కార్యక్రమాన్ని చేయడం వలనే వారు ఇతర రాష్ట్రాలకు తరలి వెళ్ళారన్నారు. ప్రతిపక్షంగా ఉన్నా ఇప్పటికీ వారి తీరు మారడం లేదన్నారు. ఆధాని వ్యవహారం రాష్ట్ర,జాతీయ స్థాయి నుండి అంతర్జాతీయ స్థాయికి వెళ్ళిందన్నారు. కూటమి ప్రభుత్వం అన్ని రంగాలలో జరిగిన నష్టాన్ని పూడుస్తూ ముందుకు వెళ్తుందని, అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వానికి అందరూ అండగా నిలవాలని ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి నాగోతు శౌరయ్య విజ్ఞప్తి చేశారు.

## ప్రజా సంకల్ప వేదిక వేమూరు అసెంబ్లీ ఇన్‌చార్జిగా మల్లేష్‌నాయక్

**కొల్లూరు, నవంబరు 27 (ప్రభాతవార్త) :** ప్రజాసంకల్ప వేదిక పరిధిలో అవినీతి నిరోధక విభాగం వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా కొల్లూరు మండలం బోస్‌నగర్ గ్రామానికి చెందిన సభావతు మల్లేశ్వరరావునాయక్‌ను నియమించినట్లు ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర అధ్యక్షులు మదిరె రంగసాయిరెడ్డి ప్రకటించారు. బుధవారం ఆయన మీడియాకు విడుదల చేసిన ఒక లేఖలో రాష్ట్రంలోని పలు నియోజకవర్గాలకు అవినీతి నిరోధక విభాగం ఇన్‌చార్జిలను ప్రకటించారు. ఈ క్రమంలో వేమూరు నియోజకవర్గం మల్లేశ్వరరావు నాయక్‌ను నియమించినట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న అవినీతి కార్యకలాపాలపై మరియు అవినీతికి పాల్పడుతున్న అధికారులపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేస్తామన్నారు. ఇన్‌చార్జిగా నియమితులైన మల్లేష్‌నాయక్ మాట్లాడుతూ ఇంతటి బాధ్యతను తమపై తనపై నమ్మకంతో అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు రంగసాయిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వేమూరు నియోజకవర్గ పరిధిలో అవినీతిని నిర్మూలించేందుకు శాయశక్తుల కృషి చేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ప్రజా సంకల్ప వేదిక సభ్యులకి ధన్యవాదాలు తెలిపారు.



## బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడాలి

### -బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కుమారస్వామి

**పిడుగురాళ్ల, నవంబరు 27 ప్రభాతవార్తః** అందరూ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కుమారస్వామి అన్నారు. పిడుగురాళ్ల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మురళీ గంగాధరరావు ఆధ్వర్యాన పట్టణంలోని మన్యం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కుమారస్వామి బాల్య వివాహాల వలన



కలిగే అనార్థాలను వివరించారు. అనంతరం విద్యార్థులచే బాల్య వివాహాలకు వ్యతిరేఖంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ కోవూరి వెంకటేశ్వర్లు, న్యాయవాది మందా జాకబ్, పారా లీగల్ వాలంటీర్ నాగార్జున, హెచ్ఎం ఎల్ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కట్టెబోయిన గంగయ్య భౌతిక కాయానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

**నాదెండ్ల,నవంబర్27,ప్రభాతవార్త:** మండలంలోని సంక్రాంతిపాడు గ్రామ మాజీ సర్పంచ్ వీరాస్వామి సోదరుడు గంగయ్య మృతిచెందారు. విషయం తెలుసుకున్న శాసనమండలి సభ్యుడు మర్రి రాజశేఖర్ బుధవారం సంక్రాంతి పాడు గ్రామానికి వెళ్లి గంగయ్య భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను



పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో కె వీరాస్వామి, శివమాణిక్యాలు, జె బొల్లయ్య, చిన వెంకటేశ్వర్లు, కె భిక్షాలు, క్రీస్తురాజ,గేరా కుమార్, జి శివ, జె యేసురత్నం తదితరులు పాల్గొని గంగయ్య భౌతికకాయానికి నివాళులు అర్పించారు.

## వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా అవగాహన

**రొంపిచర్ల, నవంబర్ 27 ప్రభాతవార్త :** వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని బుధవారం పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్వహించారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టి.బి.అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ రెండు రోజుల పాటు ప్రయాణికులు ప్రజల కోసం అవగాహన కల్పించే స్టాల్స్ బస్టాండ్‌లో ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో హెచ్ఐవి పరీక్షా కేంద్రాలు, ఐసిటిసి, గర్భిణీ స్త్రీలకు పిపిటిసి కేంద్రాలు తొమ్మిది అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఏరియా హాస్పటల్‌లో ఉచితంగా హెచ్ఐవి పరీక్షలు చేస్తారని జిల్లా అధికారి మురళీకృష్ణ తెలియజేశారు.

## తుఫాన్ ప్రభావంతో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

**నకరికల్లు, నవంబర్ 27 ప్రభాతవార్త :** రానున్న మూడు రోజుల్లో తుఫాన్ ప్రభావం ఉన్నందువలన కోతకు సిద్ధమైన వరి పంటను వెంటనే నూర్పిడి చేసుకోవాలని మండల తహశీల్దార్ పుల్లారావు, వ్యవసాయశాఖాధికారి దేవదాసులు సూచించారు. బుధవారం వారు మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్ సూరజ్‌గనోరే ఆదేశాల మేరకు వరి కొనుగోలు కేంద్రాలను రైతు సేవా కేంద్రాలలో ప్రారంభించడం జరుగుతుందన్నారు. నమోదు చేసుకున్న రైతులు ధాన్యాన్ని విక్రయించాలనుకుంటే రైతు సేవా సిబ్బందిని సంప్రదించాలన్నారు. గ్రేడ్-ఏ రకానికి రూ.2320లు ధర లభిస్తుందని రైతులు వినియోగించుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# చాపకూడును ఘనంగా నిర్వహించుకుందాం

**కారంపూడి, నవంబరు 27 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కారంపూడిలో ఈ నెల 30వ తేదీ నుంచి డిసెంబరు 4వ తేదీ వరకు జరిగే పల్నాటి వీరారాధనోత్సవాలను నిర్వహించడానికి ఏర్పాటు పూర్తి చేసి డిసెంబరు 2వ తేదీన జరిగే చాపకూడు (సహపంక్తి) భోజనాలు ఘనంగా నిర్వహించుకుందామని మండల తెలుగుదేశం పార్టీ నేతలు అన్నారు. బుధవారం వీర్ల దేవాలయంలోని చాపకూడు మండపం వద్ద పోలీసు అధికారులు, తెదేపా నేతలు సమావేశమయ్యారు. ఈ ఏడాది చాపకూడు కార్యక్రమానికి 15 వేల నుంచి 20 వేల వరకు ప్రజలు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయలు, వీఐపీలు హాజరవుతారని ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నట్లు తెలిపారు. వీర్ల దేవాలయం సమీపంలో రాష్ట్రస్థాయి ఎద్దుల బలప్రదర్శన ప్రాంతాన్ని పరిశీలించారు. సమస్యలు తలెత్తకుండా బారిగేట్లు ఏర్పాటు చేసుకోవాలని నేతలను పోలీసు అధికారులు కోరారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాసరావు, ఎస్సై వాసు, తెదేపా నేతలు పంగులూరి అంజయ్య, చప్పిడి రాము, గోళ్ల సురేష్‌యాదవ్, రమావత్ నాగులునాయక్, తుపాకుల చినరత్తయ్య, నాగారపు రాముడు, తండా మస్తాన్‌జాని, కటికల బాలకృష్ణ, ఎస్పీఆర్ కృష్ణ, కాసుల శంకర్, గాడిపర్తి పూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



## మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌ను గొప్పగ నిర్వహించాలి

**బాపట్ల, నవంబర్27, ప్రభాతవార్త:** మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనపై జిల్లా అధికారులతో స్థానిక బాపట్ల మున్సిపల్ ఉన్నత



పాఠశాలలో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ముందస్తు ఏర్పాట్లుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనను జయప్రదం చేయడానికి అధికారులు పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని అన్నారు. రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. జిల్లాలోని 1431 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ సమావేశాలు జరపాలన్నారు. అతిథులంతా ఒకేచోట లేకుండా ప్రతి పాఠశాలలో స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఐదు నుంచి 10వ తరగతి వరకు విద్యాభోధన జరుగుతుండా 23తరగతి గదులలో 912 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని అన్నారు. పాఠశాలలో చదువుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలలో వసతి పొందుతున్న విద్యార్థులను ప్రత్యేకంగా గుర్తించి వారి తల్లిదండ్రులకు ఆహ్వానం పంపాలన్నారు. పట్టణంలో ఆహ్వానం పంపాలన్నారు. ఆహ్వానించే ప్రక్రియలో సచివాలయాల సిబ్బంది సేవలను వినియోగించుకోవాలన్నారు. ఇందుకోసం ఆహ్వాన కమిటీ ఏర్పాటు చేశామని కమిటీకి కోఆర్డినేటర్‌గా రేపల్లె ఆర్డీవో వ్యవహరిస్తారన్నారు. ఉన్నత స్థాయికి ఎదిగిన పూర్వ విద్యార్థులను ఆహ్వానించాలన్నారు. విద్యార్థుల ప్రోగ్రెస్ పై సమీక్షిం చేందుకు విద్యాశాఖ అధికారులు ప్రణాళికలు రూపొందిం చాలని అన్నారు. కార్యక్రమానికి విద్యార్థులు వారి తల్లిదండ్రులకు త్రాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమీషనర్‌ను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన బందోబస్తులా అండ్ ఆర్డర్ పర్యవేక్షణ, వాహనాల పార్కింగ్ నిర్వహణ జిల్లా ఎస్పీ వ్యవహరించాలన్నారు. హెలిప్యాడ్ నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యత చీరాల ఆర్డీవోదేనన్నారు. సమావేశ ప్రాంగణం డిపివో పర్యవేక్షించాలన్నారు. పర్యావరణ సంరక్షణ కమిటీకీ అగ్నిమాపక శాఖ అధికారి పర్యవేక్షణ చేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరయ్యే సమావేశ వేదిక ద్వామా పిడి అలంకరించే బాధ్యత ఉద్యానవన శాఖ అధికారిది అని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, ఆర్డీవోలు, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా సభ్యత్వ నమోదుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి : మాజీ మంత్రి ఆలపాటి

**కొల్లిపర, నవంబరు 27 (ప్రభాతవార్త) :** తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని మాజీ



మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం మండల కేంద్రం కొల్లిపర తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నాయకులతో కలసి ఆయన సభ్యత్వ నమోదుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సభ్యత్వ నమోదు గురించి నాయకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గడచిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి 164సీట్లు ప్రజలు ఇచ్చిన నేపధ్యంలో టిడిపికి 135సీట్లు గెలిచిన సందర్భంలో ప్రతి నలుగురికి ఒక సభ్యుడుగా ఉంటానికి అవకాశం ఉందని యువ నాయకుడు లోకేష్‌బాబు ఆలోచన మేరకు కోటి మందితో సభ్యత్వ నమోదు కార్యక్రమానికి నాంది పలికినట్లు చెప్పారు. టిడిపి ఆవిర్భావం దగ్గర నుండి ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుందన్నారు. అనంతరం గ్రామ, మండల నియోజకవర్గ జిల్లా స్థాయి, రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. పార్టీలో భాగంగా సభ్యత్వ నమోదు అత్యంత ప్రాధాన్యత కూడినటువంటి వ్యవహార శైలి అన్నారు. ఇప్పటికే 52లక్షల మంది సభ్యత్వం తీసుకోవడం జరిగిందన్నారు. సభ్యత్వ నమోదుకు మంచి స్పందన కనిపిస్తుందన్నారు. ఇంకా సభ్యత్వ నమోదుకు 20రోజులు మాత్రమే ఉందన్నారు. సభ్యత్వం ప్రారంభంలోనే ఒక ఆలోచన చేయడం జరిగిందని ఎవరైతే శాశ్వత సభ్యత్వాన్ని చేయాలనుకుంటున్నారో వారు లక్ష రూపాయలు కట్టినట్లయితే శాసన సభ్యుడిగా కొనసాగవచ్చునన్నారు. తెనాలి నియోజకవర్గం కొల్లిపర మండలంలో భీమవరపు లంక కోటిరెడ్డి శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సభ్యత్వం తీసుకోవడం వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయని, కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడం కోసమే సభ్యత్వ నమోదు ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అనంతరం కొల్లిపరలో షేక్ ఖాజా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఆయన స్థానికులతో కలసి ప్రారంభించారు. ఈ సమావేశంలో టిడిపి మండలాధ్యక్షులు భీమవరపు చినకోటిరెడ్డి, దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ వంగాసాంబిరెడ్డి, నాయకులు గుదిబండి గోవర్ధనరెడ్డి, కంచర్ల అమృతరాజు, ఆళ్ల సురేష్‌రెడ్డి, బొమ్ము వెంకటరామిరెడ్డి, ఆరెమండ్ల రాధాకృష్ణారెడ్డి, దాసరి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ ప్రభాకర్‌రావును సత్కరించిన ఎమ్మెల్యే కన్నా

**సత్తెనపల్లి, నవంబర్ 27 ప్రభాతవార్త :** రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్‌గా నియమించబడిన దేగల ప్రభాకర్‌రావును బుధవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడే ప్రతి కార్యకర్తకు న్యాయం



జరుగుతుందని దేగల ప్రభాకరరావు నియామకం తెలియజేస్తుందన్నారు. బలహీన వర్గాల వారికి కూటమి ప్రభుత్వం పెద్దపీఠ వేస్తుందన్నారు. ఇటువంటి ప్రభుత్వానికి అందరి సహకారం అవసరమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

## ద్విచక్రవాహనం ఢీకొని ఇరువురికి గాయాలు

**దుర్గి, నవంబర్ 27, ప్రభాతవార్త :** ద్విచక్రవాహనం ఢీకొని ఇరువురికి గాయాలైన సంఘటన దుర్గి మోడల్‌స్కూల్ సమీపంలో బుధవారం రాత్రి జరిగింది. దుర్గికి చెందిన కపలవాయి శ్రీనివాసరావు మాచర్ల నుంచి ద్విచక్రవాహనంపై దుర్గికి వస్తుండగా ఎపి మోడల్‌స్కూల్‌లో పని చేస్తున్న కుక్కమూడి రత్నం భార్యతో కలసి దుర్గికి నడిచి వస్తుండగా శ్రీనివాసరావు ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో రత్నానికి, శ్రీనివాసరావుకు గాయాలయ్యాయి. రత్నాని న్ని స్థానిక ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స తరలించగా శ్రీనివాసరావును వైద్య చికిత్సకు మాచర్లకు తరలించారు. సంఘటనా స్థలాన్ని దుర్గి పోలీసులు సందర్శించి దర్యాప్తు చేపట్టారు.



## వేధిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి

**మాచర్ల, నవంబరు 27 ప్రభాతవార్త:** వేధింపులకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని యాదవ సంఘం నాయకులు అశోక్ సింహ అన్నారు. బుధవారం మాచర్ల యాదవ సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వేధింపులు తాళలేక ఆత్మహత్యకు యత్నించిన సర్వేయరు యేసురాజు విషయమై అధికారులు స్పందించాలన్నారు. వేధింపులకు పాల్పడిన అధికారి మహిళా ఉద్యోగుల పట్ల కూడా అసభ్యంగా ప్రవర్తించిన ఘటనలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో బీసీల కోసం రక్షణ చట్టం తీసుకురావాలన్నారు. దీనిపై కూటమి నాయకులు హామీలు అమలు చేయాలన్నారు.



## చిన్నారులను అభినందించిన ఎమ్మెల్యే కన్నా

**సత్తెనపల్లి, నవంబర్ 27 ప్రభాతవార్త :** పట్టణంలోని నారాయణ స్కూల్‌కు చెందిన విద్యార్థులను బుధవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో పాల్గొని విద్యార్థులు బహుమతులు సాధించడం అభినందనీయమన్నారు. శ్రుతన్ గోల్డ్‌మెడల్, ఎం.డి.ఫరుక్ సిల్వర్ మెడల్, సలివేంద్ర హేమల్ బ్రాంజ్ మెడల్, రాజారపు యశస్విని బ్రాంజ్ మెడల్ సాధించడం విశేషమన్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## ఓటర్ల జాబితాలో లింగ నిష్పత్తి తేడా అధికంగా ఉంటే సహించేది లేదు

**బాపట్ల, నవంబర్27, ప్రభాతవార్త:** ఓటర్ల జాబితాలో లింగ నిష్పత్తి తేడా అధికంగా ఉంటే సహించేది లేదని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ



వృద్ధుల సంక్షేమ శాఖల ప్రభుత్వం కార్యదర్శి రోల్ అబ్జర్వర్ ఏ సూర్యకుమారి తెలిపారు. సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితాపై ఈఆర్‌ఓలు, ఏఈఆర్వోలతో బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగ ఆమె మాట్లాడుతూ పర్చూరు, చీరాలలో నియోజక వర్గాలలో లింగ నిష్పత్తి సరిగా లేకపోవడం ఏమిటని అధికారులను సూర్యకుమార నిలదీశారు. చీరాల, వేమూరు నియోజకవర్గాలలోని బిఎల్‌వోలు సరిగా పనిచేయడం లేదని గుర్తించామన్నారు. అధికారులు నిర్లిప్తంగా ఉంటే కుదరదన్నారు. గైర్హాజరైన పర్చూరు ఈఆర్‌ఓకు మెమో జారీ చేయాలని ఆదేశించారు. మృతుల ఓటర్లు తొలగింపు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే బాధ్యత అధికారులపై ఉందన్నారు. కొత్త ఓటర్లను చేర్పించడం కొరకు అన్ని ప్రాంతాలలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితాకు 2,73లక్షల దరఖాస్తులు వచ్చాయని తక్షణమే వాటిని విచారించాలన్నారు. గడువులోగా పరిష్కరించాలన్నారు. ఆధార్ అనుసంధానం ప్రక్రియ కేవలం 84శాతం ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ జరగాలంటే ప్రతి ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం చేయాలన్నారు. గడిచిన 8నెలల్లో 3,163మంది ఓటర్లు వలసలు వెళ్లడంపై ఆరా తీశారు. జనవరిలో నవరణ ఓటర్ల జాబితా విడుదల చేస్తామని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను వేగంగా పరిష్కరిస్తున్నామని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. బాపట్ల జిల్లాలో 4,42,377 గృహాలు ఉండగా 17లక్షల 90వేల 116మంది జనాభా ఉన్నట్లు తెలిపారు. నూతనంగా 14,556 మంది దివ్యాంగులకు ఓటు హక్కు కల్పించామన్నారు. ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీలతోనూ అన్ని నియోజకవర్గాలలో సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. అక్టోబర్ 27వ తేది నాటిక జిల్లాలో 12,91,065ఓటర్లు ఉన్నారని కలెక్టర్ వివరించారు. యువతకు ఓటు హక్కు కల్పించడానికి క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు . సిఎంవోకి వెళ్లిన ఫిర్యాదులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి విచారించాలని అన్నారు. ప్రస్తుతం 26 అర్జీలు పిజిఆర్ఎస్‌లో నమోదు కాగా ఒక్కొక్కటిగా సమీక్షించారు. రెవెన్యూ అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నా రు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు డాక్టర్ యశోధర పువ్వాడకు షారోన్ అంతర్జాతీయ అవార్డు ప్రధానం

**తెనాలి, నవంబరు 27 (ప్రభాతవార్త) :** పట్టణానికి చెందిన ప్రముఖ వైద్య నిపుణురాలు,




డాక్టర్ యశోధర పువ్వాడకు, కెనడా దేశానికి చెందిన సంఘ సేవకురాలు షారోన్ స్మృతి చిహ్నంగా, షారోన్ అంతర్జాతీయ స్మారక అవార్డును గురువారం బుర్రిపాలెం రోడ్డు వెస్ట్ బెర్రి స్కూల్ సమీపంలోని డాక్టర్ శారద సర్వీసెస్ సమావేశపు హాలులో నిర్వహించే సమావేశంలో నిర్వాహకులు అవార్డును ప్రధానం చేయనున్నట్లు పెన్నీ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ ప్రదీప్ దోనేపూడి మీడియా సమావేశంలో తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక అవార్డు ప్రతీ సంవత్సరం, విభిన్న రంగాలలో ప్రతిభావంతులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. గురువారం సాయంత్రం 3గంటలకు డాక్టర్ యశోధర పువ్వాడ, పెన్నీ అంతర్జాతీయ అందుకునే సభలో పట్టణంలోని పలువురు పాల్గొంటాని ప్రదీప్ తెలిపారు. డాక్టర్ యశోధర పువ్వాడ వైద్య శాస్త్రంలో మాస్టర్ డిగ్రీ అందుకుని చర్మవ్యాధుల రుగ్మతలపై వైద్య సేవలను అందిస్తూ స్కిన్ స్పెషలిస్టుగా గుర్తింపు పొందారని ప్రదీప్ వివరించారు. పట్టణంలోని స్కిన్ ఇన్ హాస్పటల్ ఎమ్.డి.గా ఉన్న డాక్టర్ యశోధర చర్మవ్యాధుల వైద్య నిపుణులుగా పేరు తెచ్చుకున్నారని ప్రదీప్ తెలిపారు. కాగా గత ఏడాది ఈ అవార్డును డి3-శారద సర్వీసెస్ సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ శారదకు అందజేశామన్నారు.

## పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత

**కారంపూడి, నవంబరు 27 ప్రభాతవార్త:** పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత అని స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ కూరాకుల సుబ్బారావు అన్నారు. బుధవారం మండలంలోని చింతపల్లి గ్రామం ఎస్సీ కాలనీ మండల పరిషత్ పాఠశాలలో మరుగుదొడ్ల వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, చేతుల శుభ్రత, మరుగుదొడ్ల వినియోగం కార్యక్రమంపై విద్యార్థులకు వివరించారు. మరుగుదొడ్లు నిర్మించుకోని ప్రతిఒక్కరూ వెంటనే నిర్మించుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు సచివాలయాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో మానవహారం చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శకుంతల, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరెడ్డి, భిక్షమయ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రామాంజనేయులు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## హెచ్ఐవి,ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

**బావట్ల, నవంబర్27, ప్రభాతవార్త:** హెచ్ఐవి,ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్యారోగ్యశాఖాదికారి విజయమ్మ అన్నారు. బుధవారం వరల్డ్ ఎయిడ్స్ డే 2024 సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వారి ఆదేశాల ప్రకారం బాపట్ల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ విభాగము వారి ఆధ్వర్యంలో పట్టణములో సూర్యలంక బీచ్ నందు హెచ్ఐవి, ఎయిడ్స్ గురించి ప్రజలకు అవగాహన కలుగు చేయుటకు స్టాల్ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా వైద్యారోగ్యశాఖాదికారి విజయమ్మ తెలిపారు. ఈ స్టాల్‌లు 27,28తేదిలు రెండు రోజుల పాటు ఏర్పాటు చేయడం జరగుతుందన్నారు. ప్రజలు ఈ స్టాల్స్ ను సందర్శించి హెచ్ఐవి పట్ల అవగాహనా కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ హెచ్ఐవి స్థితిని తెలుసుకొని ఆరోగ్యముగా ఉండాలని అలాగే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించటం ప్రతి ఒక్కరి బాధ్యత కాబట్టి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా స్టాల్ ఏర్పాటులో సహకరించిన ఎపిఎస్ఎసిఎస్ మరియు మండల డెవలప్మెంట్ అధికారి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ తరపున ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి విజయమ్మ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఏపిశాక్స్ జిల్లా మేనేజర్ జానిబాష మరియు టిఐ ఎన్జీఓస్ గ్రామసిరి మహిళామండలి పాల్గొన్నారు.



## బహుముఖ ప్రజ్ఞాశాలి బొల్లిముంత శివరామకృష్ణకు వక్తల ఘననివాళి

తెనాలి, నవంబరు 27 (ప్రభాతవార్త) : ఆదర్శ కమ్యూనిస్టు అభ్యుదయ సినీ, నాటక రచయిత మార్టిస్టు గాంధీగా పిలుచుకునే బొల్లిముంత శివరామకృష్ణ 104వ జయంతిని స్థానిక ఎన్జీవో కళ్యాణ మండపంలో బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పోస్టల్ శాఖ నాయకులు బి.వి.రావు అధ్యక్షతన జరిగిన సభలో మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ తోటకూర వెంకట రమణరావు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. పలువురు అభ్యుదయ వాదులు వక్తలుగా పాల్గొని బొల్లిముంత శివరామకృష్ణ జీవనశైలిని సాహిత్య శైలిని విశ్లేషించారు. బెల్లంకొండ వెంకట్ సభకు స్వాగతం పలుకగా పువ్వునుంచి వక్తలు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బొల్లిముంత శివరామకృష్ణ రచించిన సంభవామి యుగేయుగేనాటికను ప్రదర్శించారు. సభలో అరసం జిల్లా అధ్యక్షులు కనపర్తి బెనహర్, ప్రజానాట్య మండలి అధ్యక్షులు మాణిక్యాలరావు, హరికథా భాగవతారిణి, బి.నాగమణి, కళాకారుల సంఘు నాయకులు గరికపాటి సుబ్బారావు, నీలాంబరం, తదితర సాహితీవేత్తలు, కళాకారులు పాల్గొనగా కార్యక్రమాన్ని బొల్లిముంత కృష్ణ పర్యవేక్షించారు.



## ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టిపెట్టాలి

**కారంపూడి, నవంబరు 27 ప్రభాతవార్త:** రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టిపెట్టి



ఎరువుల వాడకం తగ్గించుకొని తమ పొలాలను ఎప్పటికప్పుడు భూసార పరీక్షలు చేయించుకోవాలని రాష్ట్రీయ కృషి వికాస్ యోజన జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి కె.ప్రవీణ్ అన్నారు. బుధవారం మండలంలోని పెదకొదమగుండ్ల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రైతులకు అవగాహణ కార్యక్రమం నిర్వహించారు. ప్రవీణ్ మాట్లాడుతూ రైతులు ఎరువులు ఎక్కువగా వాడటం వలన భూసారం తగ్గి పంటలు పండవని అన్నారు. పురుగు మందులు వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయంపై దృష్టిపెట్టాలన్నారు. మిరియాల, ఒప్పిచర్ల గ్రామాల్లో వరికోతలను మండల వ్యవసాయ అదికారి యలమందారెడ్డి పరిశీలించారు. పొలాల్లో ఉన్న ధాన్యాన్ని పరిశీలించి రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ధాన్యం ఎ-గ్రేడ్ 1725 రూపాయలు, సాధారణ రకం రూ.1700 రూపాయలకు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఈ నెల 29వ తేదీ నుంచి డిసెంబరు 4వ తేదీ వరకు వాతావరణ శాఖ సూచనల మేరకు తుపాను ప్రభావం ఉంటుందని రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యవసాయ సహాయకులు కె.వి.శ్రీనివాసరావు, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**కర్లపాలెం, నవంబర్27, ప్రభాతవార్త:** సిఫార్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ మరియు మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన బాల్




వివాహ్ ముక్తి భారత్ కార్యక్రమంపై కర్లపాలెం మండల సచివాలయం ప్రాంగణంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సిఫార్డ్ స్వచ్ఛంధ సేవా సంస్థ డైరెక్టర్ కె రవి ప్రదీప్ మాట్లాడుతూ బాల్య వివాహాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రతి గ్రామంలో బాల్యవివాహాల నిర్మూలనకు కమిటీలను ఏర్పాటు చేసి బాల్యవివాహ రహిత భారతదేశం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలియజేశారు. మండల న్యాయ సేవా అధికార సంస్థ ప్యానల్ లాయర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి గ్రామం బాల్యవివాహరహిత గ్రామంగా తీర్చిదిద్దాలని దాని కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యాక్సెస్ టూ జస్టీస్ జిల్లా కో ఆర్డినేటర్ బడుగు కిషోర్, సిఫార్డ్ కో ఆర్డినేటర్ ప్రభాకర్, కర్లపాలెం పంచాయితీ మహిళా సంరక్షణ కార్యదర్శి సౌందర్య పారా లీగల్ వాలంటీర్, ఖాన్, సిఫార్డ్ సిబ్బంది నాగరాజు, రామకృష్ణ దేవయ్య, అంగన్వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు

**మాచర్ల, నవంబరు 27 ప్రభాతవార్త:** రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదర్శపాఠశాలలో విద్యార్థులకు బుధవారం బహుమతులు అందజేసినట్లు సేవాసమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. స్వామి వివేకానంద రామకృష్ణ మిషన్‌ను స్థాపించి 125 సంవత్సరాలైన సందర్భంగా ప్రతి స్కూలు, ప్రతి కళాశాలలో భారత జాతికి నా హితవు అనే పుస్తకం ఆధారంగా విద్యార్థినీ విద్యార్థులకు జాగృతి పోటీలు నిర్వహించినట్లు గోవిందరెడ్డి తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా గోవిందరెడ్డి మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థుల్లో నైతిక, ఆధ్యాత్మిక విలువలు పెంపొందించేలా జాగృతి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదర్శపాఠశాల ఉపాధ్యాయులు చాముండేశ్వరి, సేవాసమితి సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## కులమతాలకు అతీతగా వాసవీక్లబ్ సేవలు : డిస్టిక్ 204ఎ గవర్నర్ చిరంజీవి

**మాచర్ల, నవంబరు 27 ప్రభాతవార్త:** ప్రపంచ వ్యాప్తంగా 26 దేశాల్లో పేద, మధ్య తరగతి వారికి వాసవీ క్లబ్ ఆరు దశాబ్దాలుగా సేవలు నిర్వహిస్తుందని వాసవీ ఇంటర్నేషనల్ డిస్టిక్ 204ఎ గవర్నర్ మునగాల చిరంజీవి అన్నారు. మీ ఊరికి మీ గవర్నర్ కార్యక్రమంలో భాగంగా వాసవీక్లబ్ మాచర్ల చెన్నకేశవ సభ్యులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వాసవి క్లబ్‌లో చేరి పేద, మధ్య తరగతి వారికి సాయమందించాలన్నారు. వాసవీ క్లబ్ కుల, మత రహితంగా సేవలందిస్తూ ముందుకెళ్తుందన్నారు. ప్రతి ఏటా ప్రపంచ వ్యాప్తంగా సుమారు రూ.70 కోట్లు ఖర్చు చేసి పలు సేవా కార్యక్రమాలకు చేస్తుందన్నారు. నూతన క్లబ్ ఏర్పాటు డిసెంబరులోపు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ మాచర్ల చెన్నకేశవ అధ్యక్షులు ఒరుగంటి చెన్నకేశవరావు, వ్యవస్థాపక అధ్యక్షులు తిరువీధి వెంకటనాగేశ్వరరావు, వాసవీక్లబ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, ట్రెజరర్ కేశవరావు, జిల్లా నాయకులు మేడం నాగేశ్వరరావు, ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.



## వీధులను పరిశీలించిన మునిసిపల్ ఛైర్మన్ పోలూరి

**మాచర్ల, నవంబరు 27 ప్రభాతవార్త:** మాచర్ల పట్టణంలోని 8వ వార్డులో రోడ్డు మరమ్మతు పనులను మున్సిపల్ ఛైర్మన్ పోలూర నరసింహారావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు పలు సమస్యలను ఆయనకు విన్నవించారు. తాగునీటి సమస్యను ఆయన దృష్టికి తెచ్చారు. నరసింహారావు మాట్లాడుతూ వార్డులో సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. సమస్యల పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఆయన వెంట కౌన్సిలర్లు, కూటమి నాయకులు ఉన్నారు.



## డిగ్రీ కళాశాలల్లో ఓటరు నమోదు క్యాంపులు

**మాచర్ల, నవంబరు 27 ప్రభాతవార్త:** మాచర్ల పట్టణ పరిధిలోని 31 వార్డుల్లో 18 సంవత్సరాలు నిండిన అర్హులైనవారు కొత్తగా ఓటుహక్కుకు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వేణుబాబు తెలిపారు. గురువారం పట్టణంలో ఉన్న డిగ్రీ కళాశాలల్లో బూత్‌లెవల్ అధికారులచే ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని రాజకీయ ప్రజాప్రతినిధులు, బూత్ ఏజెంట్లు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

